
# కొత్తగా వచ్చిన మనిషి!

*రాజేంద్ర



లక్ష్మణరావు ఆరోజు ఉద్యోగంలో ప్రవేశించి ముందుగా మిత్రుడు కుదిర్చిపెట్టిన ఇంట్లో ప్రవేశించాడు. ఆరోజు సాయంకాలమే ఆయిల్లు తనకు పనికిరాదని తీర్మానించుకొన్నాడు. గాలి లేదు, వెలుతురు లేదు. సైడు కాలవ దుర్గంధంతో అవచ్చే కొంత గాలీ ఇంట్లో ప్రవేశించి మనుష్యుల్ని బైటికి తరుముతుంది. వెంటనే వేరే ఇల్లు చూసుకోవడం ఉత్తమమని తోచింది. మిత్రుడు ఉద్యోగం తనకు అప్పగించి వెళ్లిపోయాడు; ఊళ్ళో ఇంకే స్నేహితులూ లేరు. ఎవరైనా కొంచెం పరిచయమైన తర్వాత వేరే ఇంటిని చూసుకోవచ్చునని నిశ్చయించుకొన్నాడు.

సాయంకాలం క్లబ్బుకు బయలుదేరాడు. క్లబ్బుకు వెళ్ళే రోడ్డు కిరువైపులా మంచి ఇళ్ళున్నాయి. వీటిలో ఏదైనా ఖాళీగా వుండకూడదూ! అనుకొన్నాడు. మంచి రచయితదగ్గర ఎవరైనా సంపాదకు లడిగితే ఇవ్వడానికి కథ సిద్ధంగా వుండనట్టే మంచివీధిలో మంచి ఇళ్ళు ఖాళీగావుండవు కాబోలు అనుకొన్నాడు. సామాన్యుడైన రచయిత దగ్గర తిరిగివచ్చిన కథలు, ఎంతో మంది 'నమస్కారాలు' అందుకొన్న కథలు బోలెడువున్నట్లు, సందులలో గొందులలో పనికిరాని ఇళ్ళు కొల్లలుగా వుంటాయి?

క్లబ్బులో కొన్ని ఉత్సాహమున్న ముఖాలు. కొన్ని చప్పగావున్న ముఖాలు... కొన్ని 'సోమరి' గావున్న ముఖాలు... ఎవరూ ఆకర్షించలేదతణ్ణి. కానీ అందరినీ అతడు ఆకర్షించాడు.

"ఓ మీరేనా సార్. ఈరోజు...ఆఫీసరుగా ప్రవేశించిందీ"

"ఓ మీరేనన్నమాట"

"నమస్తే రండి. తమపేరండి..."

"తమ స్వగ్రామం..."

చాల ప్రశ్నలు వేశారు చాలమంది. జవాబులు విని తమతమ ఆటల్లో మునిగిపోయారు.

లక్ష్మణరావుకు చదరంగం చాల ఇష్టం. అయితే ఆ బల్ల ఖాళీగావుంది. 'ముందు సభ్యుడిగా చేరదాం' అనుకొని 'కార్యదర్శి' అని గదిముందు రాసివున్న గదిలోకి వెళ్లాడు. అది గది కానే కాదు అది ఒక పొగ గొట్టం! గదంతా పొగ. హఠాత్తుగా బిగరగా నవ్వులు...రెండు నిముషాలు ఆగాడు.

"ఓ రండి సార్......ఎవరూ......తమరూ..." అని ఒక గంభీరమైనగొంతు.

"ఇక్కడ కార్యదర్శిగారున్నారాండి"

"ఓ...నేనే రండి..."

"నేను క్లబ్బులో చేరాలండి" అంటూ దగరకు వెళ్ళాడు. ముగ్గురు మనుష్యులు టేబిలుమీదకి కాళ్లు పెటుకుని తలలు, కుర్చీలమీద పెట్టుకొని కూర్చుని సిగరెట్లు కాలుస్తున్నారు. అందులో సిగరెట్ నోట్లో కాకుండా వేళ్ళ మధ్య వుంచుకొని తీవ్రంగావున్న మనిషి కార్యదర్శి అని లక్ష్మణరావు గుర్తుపట్టాడు.

"కూర్చోండి" అనగానే కూర్చున్నాడు. కూర్చుని తనెవరో చెప్పుకున్నాడు. కార్యదర్శి, మిగిలిన ఇద్దరూ టేబిలుమీది నుంచి కాళ్ళు దించేశారు. కార్యదర్శికూడా సిగరెట్ ఎక్కడో పారేశాడు. ఈ కార్యదర్శికి, తనతో 'ఆఫీసు పని' విషయం చాల వుంటుందని వెంటనే పోల్చుకున్నాడు లక్ష్మణరావు.

"వెంటనే చేరండి సార్. మొదటి సారి రెండు రూపాయలు కట్టాలి. ఒకరూపాయి ప్రవేశ రుసుము, మరో రూపాయేమో ఈ నెలకు చందా...మరి..." ఇంకేం చెప్పాలో తోచలేదు కార్యదర్శికి.

"ఇప్పుడే చేరచ్చాండీ!" అనగానే—

"ఓ యస్...చేరండి సార్" అన్నాడు కార్యదర్శి. అని పైకిలేచి అలమరా నుంచి రసీదుపుస్తకం తీశాడు. డబ్బు ఇవ్వకముందే రసీదు రాయడం ప్రారంభించి, "తమ పేరు సార్?" అన్నాడు.

"లక్ష్మణరావు" అన్నాడు.

"ఎవరు లక్ష్మణుడు? ఊర్మిళ ఎక్కడ?" అంటూ రివటలా వుండి, తెల్లగా, ఉత్సాహంగా వున్న ఒక యువకుడు ఆ గదిలో ప్రవేశించాడు.

లక్ష్మణరావును చూసి—"ఎవరో అనుకొన్నా క్షమించాలండీ" అన్నాడు.

"దానికేం లెండి" అంటూ జేబులోనుంచి రెండు రూపాయలు తీసి కార్యదర్శి గారికిచ్చి రసీదు పుచ్చుకొన్నాడు.

లేచి "వస్తానండీ" అన్నాడు.

"ఇంతకూ మీకు ఏయే ఆటలు ఇష్టమో చెప్పారు కారు. పేకాటొచ్చాండీ?" అన్నాడు కార్యదర్శి.

"వచ్చు కానీండీ ఆడే అలవాటు లేదండీ. టెన్నిస్ ఆడుతాను గానీ కెకెట్ వచ్చిన తర్వాత చేరుతాను ఈలోగా చదరంగం ఆడుతూ వుంటాను. చదరంగం ఆడేవాళ్ళు ఎవరూ వున్నట్టు లేరే?" అన్నాడతను.

"లేకేమండీ? నేనున్నాను? రండి. నేనూ ఎవరూ లేరే అని చూస్తున్నా" అని గది వెలుపల వరండాలోకి వచ్చాడతను. ఇద్దరూ చదరంగం వున్న బల్లదగ్గరకు వచ్చి కూర్చున్నారు.

ఒకర్నొకరు పరిచయం చేసుకున్నారు. ఆ యువకుడి పేరు రామదాసు. తనకు రెండు లారీలున్నాయని, వాటిని అద్దెకు నడుపుతున్నారనీ, మరో వ్యాసంగమేమీ లేదనీ, చెప్పాడు రామదాసు.

ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు రాజా, మంత్రీ...కదులుతున్నాయి కొన్ని మరణిస్తున్నాయి. ఆట సాగుతోంది. తను ఓడిపోతున్నట్లు లక్ష్మణరావు గ్రహించాడు. కానీ తనను చిన్నబుచ్చినట్లవుతుందేమోనని అతను తెలిసే, తనవాటితో అతని వాటిని చంపే అవకాశం కలిగించి, గెలిపించేశాడు. మరో ఆట వేశారు. ఈలోగా అతను ఎక్కడ ఇల్లు కుదిరిందీ, ఎలావున్నదీ, భోజనం, పెళ్లి, బంధువులు...చదువు.. వగైరా అన్ని విషయాలూ లక్ష్మణరావుగురించి అడిగి తెలుసుకొన్నాడు.

"ఆ ఇలు నాకు తెలుసుగదూ! ఉత్తపనికిరాని వెధవఇల్లు. నాకు తెలుసు లెండి. ఆ విషయం నాకొదలండి. మీకు ఫస్ట్ కాసయిన ఇల్లు చూసి పెడతాను. మీకు రేడియో వుందాండీ? లేదూ...సరే...కొనేద్దాం లెండి. డబ్బు ఒకేసారి ఇచ్చేయాలని ఏం లేదు. వాయిదాలపద్ధతినే కొనొచ్చు. ఈ ఊళ్ళో దోమలు చంపేస్తాయి. రాత్రికుని ద్రపోనీవు. దోమతెర తెచ్చుకున్నారుగదా! తీసుకురాకపోతే...ఫరవాలేదులెండి. నేను రేపు ఉదయం మావాడిచేత కుట్టించి పంపుతాను. ఇంకో మీ ఏనుగును చంపేశాను. మీ రాజుకు చెక్కిచ్చాను. కాచుకోండి..."

* * *

మరునాడు ఉదయం ఎనిమిదింటికల్లా రామదాసు లక్ష్మణరావు ఇంటికొచ్చాడు.

"ఇంతత్వరలో ఇంటికొచ్చేమనిషి ఒకరు లభించడం ఎంతఅదృష్టం. మనిషి చాలా మంచివాడులా వున్నాడు. ఎవరికింపట్టింది తన బాగోగుల విషయం. ఇతను పాపం చాల శ్రద్ధతీసుకొంటున్నాడు. ఇలాటివారు వుండబట్టే ఇంకా ప్రపంచం ఇలాగ నిలబడి వుంది..." అనుకొన్నాడు. కూర్చొని మర్యాదచేశాడు.

కాఫీఅదీ పూర్తయిందాండీ! మీకోసం క్లబ్ రోడ్ లో రెండు మంచిఇళ్ళు చూశాను. మీరు ఎప్పుడు వీలయితే అప్పుడువచ్చి చూసి [illegible]నచ్చిన ఇంట్లో చేరొచ్చు. ఆరెండూ [illegible] అంటే, మూడో ఇల్లు చూపి[illegible]న్నాడు రామదాసు.

"అద్భుతం" అనుకొన్నాడు లక్ష్మణరావు. "ఇప్పుడే వెళ్ళి చూద్దామండీ. ఈ కొంపను ఎంత త్వరగా వదిలేస్తే అంత మంచిది. పదండి."

వెంటనే వెళ్ళి ఇళ్లు చూశారు. అందులో ఒకయిల్లు పూర్తిగా నచ్చింది లక్ష్మణరావుకు. అందులో తనూ, తన భార్యా...ఇద్దరే... ఎంత హాయిగా వుండటానికి వీలుందో ఒకసారి సమగ్రంగా వూహించుకొన్నాడు. వెంటనే ఎడ్వాన్సిచ్చేశాడు.

"మీరు వెంటనే ఫామిలీ తెచ్చుకోవడం శ్రేయస్కరం. ఈ హోటల్లో తింటే, అన్యాయంగా పాడయిపోతారు...ఎప్పుడు తీసుకొస్తారు చెప్పండి. ఈలోగా ఒక మంచి పనిమనిషిని, పాలమనిషిని, పెరుగు మనిషిని, ఏర్పాటు చేస్తాను." అన్నాడు ఇంటికి తిరిగివస్తూ దారిలో రామదాసు.

"అన్నీ కుదరగానే తీసుకు రావాలనుకొంటున్నానండీ." అన్నాడు చాల ఆనందంతో లక్ష్మణరావు.

"మీరు ఇప్పుడు ప్రవేశించే ఇంటినుంచి ఆఫీసుకు చాల దూరమవుతుంది. సైకిలు లేకపోతే కొంచం కష్టంగానే వుంటుందనుకొంటాను" అన్నాడు రామదాసు.

"సైకిలు వూళ్లో వుందండీ. బుక్ చేసిపంపమని రాశాను. త్వరలోనే వచ్చేస్తుందిలెండి" అన్నాడు లక్ష్మణరావు.

"అంతవరకు మీకేమీ అభ్యంతరం లేక



పోతే నా సైకిలు వాడుకోవచ్చు. మీ దగ్గరే వుంచుకోండి దాన్ని. ఆ యిల్లు మాయింటికి దగ్గరేగా, ఎప్పుడైనా అవసరమైతే వచ్చి తీసుకొంటాను" అన్నాడతను.

'అద్భుతమైన మనిషి' అనుకొని "అ ఎందుకండీ ఇదేం దూరం కాదులెండి" అన్నాడు తను.

అతడు వినలేదు. దారిలో ఒక కుర్రాడిని పిలిచి ఇంటికివెళ్లి సైకిలు తీసుకొనిరమ్మని అప్పుడే చెప్పి పంపేశాడు. లక్ష్మణరావుకు ఏంచెప్పాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తిత్వానికి భంగంరాకుండా ఎలా ప్రవర్తించాలో 'వ్యక్తిత్వము' అనే పుస్తకంలో రాసినవిషయాలు జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. చచ్చినా జ్ఞాపకం రాలేదు. కానీ అందులో 'ఇలాంటి మనుష్యులపట్ల చాలజాగ్రతగా వుండాలని, రాసినవిషయం మటుకు జ్ఞాపకంవచ్చింది!' ఏ ఉద్దేశంతో ఆవ్యక్తి, ఇలాంటి సహాయం చేస్తూన్నాడూ అని, ఆ ఎదుటవాడికి ఏమాత్రమూ, తను అనుమాన పడుతున్నట్లు అనుమానం కలగకుండా, జాగ్రతగా బోధపరచుకోనే ప్రయత్నం చేయాలి!

ఇద్దరూ ఇంటిదగ్గరికి వచ్చారు. "వస్తానండీ సాయంకాలం మళ్ళీవస్తాను. ఇల్లు మార్చేద్దాం" అంటూ రామదాసు చకచకా, ఆర్డెంటుగా నడిచి వెళ్ళిపోయాడు.

* * *



లక్ష్మణరావు ఊరుకువెళ్ళి భార్యను తీసుకువచ్చి కొత్తయింట్లో కాపురం పెట్టాడు. అన్నిసౌకర్యాలు కుదిరాయి. ఈ సందర్భంలో రామదాసుచేసిన సహాయం ఇంతా అంతా కాదు.

అన్ని కుదిరాయనుకొన్న తర్వాత పదిహేనురోజులు, రామదాసు ఊళ్ళోలేక కనిపించలేదు. ఒక ఆదివారంనాడు సాయంకాలం హఠాత్తుగా——

"లక్ష్మణరావుగారూ..."అంటూ ఇంట్లో అడుగుపెట్టాడు:

లక్ష్మణరావు చాలఆనందంతో రామదాసును లోపలికిరమ్మని కూర్చోపెట్టాడు. భార్య శారదనుపిలిచి "రామదాసుగారికి కాఫీఇవ్వు" అన్నాడు.

రామదాసు ఒకసారి వంటయిల్లు చూడాలన్నాడు. దంపతులతనికి వంటయిల్లు చూపించారు. శారద తను ఆవంటగదిని ఎంత నేర్పుతో సర్దుకొన్నదీ, నిర్వహిస్తున్నదీ క్లుప్తంగా వివరించింది.

కానీ రామదాసుకు చాల లోపాలు కనిపించాయి. చిన్న చిన్న డబ్బాలు అవీ వుంచుకోవడానికి మంచి అలమరాలేదు. గరితెలు వగైరాలు తగిలించడానికి 'స్టాండు' లేదు. పాత్రలుంచుకోడానికి చిన్న అరుగు వంటివిలేదు. ఇంకా చాల కనిపించాయి. ముఖ్యం, ఆ గది గచ్చంతా పోయింది. క్రింద మంచి సిమెంటు వేయిస్తేగానీ బావుండదు.

"ఒక మంచిగోడ అలమరా, స్టాండు రేపు టౌనునుంచి తెప్పించేస్తాను. ఈ ఇంటి యజమాని సాయంకాలం కనిపిస్తాడు. వెంటనే గచ్చు వేయించమంటాను. ఆ గదిని ఇంకా ఎంత బాగా తయారు చేయాలో అంత బాగానూ చేయించేద్దాం," అన్నాడు ఉత్సాహంతో రామదాసు.

లక్ష్మణరావు భార్య శారదకు చాల సంతోషం కలిగింది. 'ఊరుకాని ఊరులో తన భర్త, ప్రయోజకుడైన, సరసుడైన తన భర్త 'ఒక మంచి స్నేహితుణ్ణి' సంపాయించాడు!

రోజులు గడిచాయి. రామదాసు లక్ష్మణరావుకు ఆప్తమిత్రుడయ్యాడు. కానీ అతని లోపల "ఇతడు ఏ ఉద్దేశంతో స్నేహంగా వుంటున్నాడ"నే ప్రశ్న తొలగనేలేదు. అప్పుడప్పుడూ తనలో ఆ ప్రశ్న బాధిస్తూవుతున్నందుకు విచారిస్తున్నాడు కూడాను.

ఒక రోజు ఆఫీసులో పెద్ద గుమాస్తా దగ్గరగా వచ్చి చెప్పాడు.

"మీరు ఆయనతో స్నేహం చేయడం మంచిది కాదేమోసార్. తెలిసికూడా చెప్పకుండా వూరుకోవడం ధర్మం కాదేమో నని మీకు చెపుతున్నాను. అతడు ఇన్సూరెన్సు ఏజెంటు. మరికొన్ని వ్యాపార కంపెనీలకు కూడా ఏజెంటుగా వుంటున్నాడు. ఇంక

(55 వ పేజీ చూడండి)

## గొడుగులాంటి మనిషి

(21 వ పేజీ తరువాయి)

త్వరలోనె మిమ్మల్ని ఉపయోగించుకోవడం ప్రారంభిస్తాడు. దయచేసి ఇదంతా సాహసించి చెప్పినందుకు క్షమించండి."

లక్ష్మణరావుకు గొప్ప ఆశ్చర్యం కలగలేదు. "సరే మంచిది మీరు వెళ్లండి" అని వూరుకొన్నాడప్పటికి. ఆతర్వాత ఆ మాటలనుగురించి చాలసేపు ఆలోచించాడు. రామదాసు కనిపిస్తే అడిగేసి తేల్చుకోవడం మంచిదనుకొన్నాడు. అలాంటి దురుద్దేశాలు లోపల వుంచుకొని తనతో అంత సఖ్యంగా ఎలా ప్రవర్తిసున్నాడు? ఒకవేళ అందులో, తప్పులేదేమో కూడాను? అతడి ఉద్యోగ ధర్మాన్ని అతడు నిర్వహించడంలో, తనతో స్నేహంచేసి మంచి చేసుకోవడంకూడా ఒక భాగం కావచ్చు...

మరునాడు సాయంకాలం రామదాసు ఇంటికివచ్చాడు. రామదాసును చూడగానే లక్ష్మణరావుకు నిగ్రహించుకోలేనంతఉద్రేకం వచ్చింది.

"రామదాసుగారూ మీ సంగతంతా తెలిసింది. మీరు నాప్రాణం తీసినాసరే నేను ఇన్సూర్ చేయదలచుకోలేదు. ఇదివరకు ఒకసారి మా ఆఫీసరు స్నేహితుడు ఏజెంటుగా వుండి, ఆఫీసరుగారు చెప్తే, ఆయన తృప్తికోసం చేశాను. తర్వాత ఆయన బదిలీ రాగానే కట్టడం మానేశాను అప్పటికింకా పాలసీరాకపోతే, ఆ కట్టిన ధరావతును తిరిగి తీసుకొన్నాను కూడాను. అర్థమైందనుకొంటాను మీకు. ప్రపంచంలో నేను ఎవరికైనా దగ్గర చేరుస్తాను గానీ మీలాంటివారికి మాత్రం పూర్తిగా దూరంగా వుండదలచాను. ఇదివరకు మీరు చేసిన సహాయానికి చాల కృతజ్ఞుణ్ణి......" ఇంకా ఏదో అంటున్నాడు.

రామదాసులో ఎలాంటి వికారమూ కలగలేదు. అతడి పెదవులమధ్య నిట్టూర్పులో కూడిన చిరునవ్వు! ఒక్కమాట మాట్లాడకుండా తిరిగి వెళ్ళిపోయాడు. చాల నెమ్మదిగా నడిచి వెళ్ళిపోయాడు.

రెండురోజులు గడిచాయి. ఈలోగా "తను పొరబాటు చేశాడేమో"నని అమితంగా బాధపడ సాగాడు లక్ష్మణరావు. అదిగాక అతనిభార్య శారద "మీరు చాల అనుచితంగా ప్రవర్తించార"ని స్పష్టంగా చెప్పింది.

'పెద్దగుమాస్తా రామస్వామి చెప్పింది రైటేనా...' అని ఆలోచించాడు. మరోకసారి అతణ్ణి అడిగి చూడాలనుకొన్నారు.

"ఏమండీ మీరు మొన్న రామదాసు గురించి చెప్పింది నిజమేనంటారా?" అని అడిగాడు.

"ఏ రామదాసు గురించి సార్" అన్నాడు రామస్వామి.

"అదే మొన్న ఇన్సూరెన్సు ఏజెంటని ఇంకా ఏదో చెప్పి నన్ను స్నేహం చెయ్యొద్దని చెప్పారు చూడండీ..."

"రామదాసు కాదండీ నేను చెప్పింది! మీరు ఆమధ్య షికారు వెళ్తున్నారు చూడండీ 'వెంకటసుబ్బయ్య' అనే క్లబ్ మెంబరుతో ఆయనగురించి చెప్పాను" అన్నాడు రామస్వామి.

ఈసారి లక్ష్మణరావు నరాలుదారుణంగా అలసిపోయాయి. చప్పగా కుర్చీలో కూలబడిపోయాడు. కొన్ని నిముషాలు అలా వూరుకున్నాడు. తర్వాత—

"మీకు రామదాసుగురించి ఏమైనా తెలుసా!" అని అడిగాడు.

"తెలీకేం సార్ రామదాసు చాలా మంచివాడు. వాళ్ళనాన్నగారు ఇతణ్ణి పూర్తిగా వ్యాపారంలో దించేయాలని చూస్తున్నారు. కానీ ఇతడుమాత్రం మంచి స్నేహితుడంటూ దొరికితే చాలు, వాళ్ళను కంటికి రెప్పలాగ, ఎండలో గొడుగులాగ చూసుకొంటూ ఆ ఆనందంతో గడిపేస్తూ వుంటాడు. మనిషి మాత్రం చాల యోగ్యుడండీ! సందేహమేమీ లేదు" అన్నాడు రామస్వామి.

"సరె వెళ్లిపని చూసుకోండి" అని రామస్వామిని పంపించేశాడు.

ఎట్లాఐనాసరె ఒక్కసారి రామదాసును చూడాలనుకొన్నాడు. మళ్ళీ ఏముఖంతో అతణ్ణి కలుసుకోవడమా అనిపిస్తున్నా సరే... వెళ్ళి రామదాసును కలుసుకోటానికి తీర్మానించుకొన్నాడు కానీ ఇక రామదాసు తనను గౌరవించగలడా అసలు తనముఖం చూస్తాడా అనిపించింది తన తొందరపాటుకు అమితంగా పశ్చాత్తాపం కలిగింది. ఎట్లా అయినాసరే రామదాసును కలుసుకొని మళ్ళీ మామూలు స్నేహంలోకి వచ్చి అతణ్ణి తీసుకొనిగాని ఇంటికివెళ్లరాదనుకొన్నాడు. ఇదంతా శారదకు తెలిస్తే తనను ఎంత దూషిసుందో......!

ఆఫీసువేళ పూర్తికాగానే బయలుదేరి రామదాసు ఇంటికేసినడక సాగించాడు. కొంతదూరం వెళ్ళేసరికి...ఎదురుగా రామదాసు అతనితో మరో మనిషి... వస్తున్నారు. అతను మామూలుగా నవ్వుతూ మాట్లాడుతూ వస్తున్నాడు. ఇతడు నాలాంటి మరో కొత్త స్నేహితుడు కాబోలను కొన్నాడు లక్ష్మణరావు. అతడొక్షణంలో అమితంగా వ్యాకుల పడిపోయాడు.

'ఎట్లాపలకరించడం రామదాసును? ఏదో అశక్తత సిగ్గు ఆవరిస్తున్నాయో' అనుకొంటూ నడుస్తున్నాడు.

"ఒ లక్ష్మణరావుగారు...ఏమిటి ఇలా వస్తున్నారు...వీరు లక్ష్మణరావుగారండి... వీరూ భీమసేన రావుగారని... ఇక్కడి ఫారెస్ట్ రేంజి ఆఫీసరుగా పనిచేస్తున్నారు. మొన్ననె ఇక్కడకువచ్చి జాయినయ్యారు. వారికి ఇంకా మంచి ఇల్లేది కుదరలేదు. అదే చూస్తున్నాము. ఈపనిలోనే అసలు మీదగ్గరకు రాలేకపోయాను. వదినగారు కులాసాగదా......"

"మూర్ఖపోతే బావుండును" అనుకొన్నాడు లక్ష్మణరావు. కానీ రామదాసు అనే గొడుగునీడలో వున్నంత వరకు ఏ మనిషికీ మూర్ఛరానే రాదు. రామదాసు గొడుగువంటి మనిషి !

★


విూకు అవసరమైన ....

ఆంధ్ర మెట్రిక్యులేషన్, శ్రీ యూనివర్శిటీ, బిఏ, బిఎస్ సి., లా అండ్ లిటరేచర్ పుస్తకములకు మాకు వ్రాయండి.

వైజాగ్ బుక్ హౌస్, వైజాగ్.





సోడాతో కలిపి

ఫ్రూటాల్

ఎల్లప్పుడు సేవించండి






కేసరికుటీరం ప్రైవేట్ లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14.

ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు:
మెసర్సు సీతారామ్ జనరల్ స్టోర్సు ఏజన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.